కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్

బొమ్మనపల్లిలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్

చిగురుమామిడి, జూన్ 7 : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని బొమ్మనపల్లికి బీఆర్ఎస్ కార్యకర్త మిడుదుల కొమురమల్లు ప్రమాదవశాత్తూ మరణించగా పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రూ.2 లక్షల చెక్కును నామినీ కొమురవ్వకు మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో అందజేశారు. వీరి వెంట జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, గ్రామాధ్యక్షుడు కత్తుల రమేశ్, ఎంపీటీసీ మిట్టపల్లి మల్లేశం, మాజీ సర్పంచ్ జక్కుల రవి తదితరులున్నారు.

నేడు మృగశిర కార్తె

కరీంనగర్ రూరల్, జూన్ 7: వేసవి రోహిణి కార్తె తర్వాత వచ్చే మృగశిర కార్తెకు ఎంతో ప్రాధాన్యం ఉంది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో వేసవి తీవ్రత తగ్గుముఖం పట్టి తొలకరి జల్లులు కురుస్తాయి. దీంతో రైతన్నలు దుక్కిదున్ని నాట్లు వేస్తారు. అలాగే, మృగశిర మొదటి రోజు చేపలు తినే ఆచారం మన పూర్వీకుల నుంచి అనాదిగా వస్తోంది. మృగశిర కార్తె ఆరంభంలో వచ్చే వాతావరణ మార్పుల కారణంగా శరీరంలో ఉష్ణోగ్రత తగ్గిపోయి వ్యాధులు సంక్రమించవచ్చు. దీని నుంచి గట్టెక్కేందుకు చేపలు తింటారు. దీని వల్ల గుండె జబ్బులు, ఆస్తమా, రోగులకు ఉపశమనం కలుగుతుంది. దీంతో ఈరోజు చేపలకు పుల్ డిమాండ్ ఉంటుంది. శాఖాహారులైతే ఇంగువను బెల్లంలో కలుపుకుని గోలీలాగా తయారు చేసుకుని తింటారు.

కేంద్రం కుల గణన చేపట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గీకురు రవీందర్

చిగురుమామిడిలో మాట్లాడుతున్న గీకురు రవీందర్

చిగురుమామిడి, జూన్ 7: కేంద్రంలో బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జడ్పీ ఫ్లోర్‌లీడర్ గీకురు రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, భారత సార్వత్రిక ఎన్నికల్లో మోడీ ప్రభంజనం తగ్గిందని, ఈ పరిణామం బీజేపీ పదేళ్ల పాలనకు తిరోగమనమన్నారు. గత రెండు ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ తగ్గి, విపక్షాల కూటమి అనూహ్య రీతిలో పుంజుకున్నదన్నారు. అయోధ్య పేరుతో మతపరంగా ఓట్లు సంపాదిస్తామనే కపట ఆలోచన బెడిసి కొట్టిందన్నారు. బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం వెంటనే కేంద్రంలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు రామోజు రాజకుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు తిరుపతి, మండల యూత్ నాయకులు గట్టు ప్రశాంత్, పెసరి శ్రీనివాస్, పోతర్ల శివాంజనేయులు, గంగుల లింగం యాదవ్, పెసరి వెంకటయ్య, గండికోట రాజమల్లు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★Karimnagar-Hyd Highway Road, R.K.Colony Residential & Commercial 6 Guntas Plots are available. Contact on: 7780646886.
NT-327730

CHANGE OF NAME

★I, MOHAMMAD IBRAHEEM S/o MOHAMMAD AHMED PASHA (ols name) Age 40 Years, R/o H.No: 6-75, Razvi Colony, Mandal Kannala, Dist Karimnagar., I have Changed my name as MOHAMMAD IBRAHIM S/O MOHAMMAD AHMED PASHA (New Name).
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

అంఖండ హరినామ సంకీర్తనలో మహిళలు

సైదాపూర్, జూన్ 7 : తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిత్యం జరిగే అఖండ హరినామ సంకీర్తనలో మండలంలోని రాములపల్లి గ్రామ మహిళలు పాల్గొన్నారు. ఇక్కడ భజన మండలి సభ్యులున్నారు.

స్పేస్ టెక్నాలజీ, అప్లికేషన్స్ ప్రోగ్రాంకు ఆహ్వానం

చిగురుమామిడి, జూన్ 7: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఐఆర్ఎస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఆర్వో), కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు షరీఫ్ అహ్మద్‌ను ఈనెల 10 నుంచి 14 వరకు జరిగే స్పేస్ టెక్నాలజీ అప్లికేషన్స్ ఫర్ స్కూల్ టీచర్స్ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి ఆహ్వానించింది. ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు స్పేస్ టెక్నాలజీ వినియోగం, అప్లికేషన్లపై అవగాహన కల్పిస్తారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎంఈవో విడపు శ్రీనివాస్

వీణవంక: చల్లూరు బడిబాటలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈవో శ్రీనివాస్

వీణవంక, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన లభిస్తుందని మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చల్లూరు గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఎంఈవో శ్రీనివాస్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాంలు ప్రభుత్వం అందజేస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సంపత్‌కుమార్‌చారి, శివకుమార్, ఉపాధ్యాయులు బాలాజీ, నాగిరెడ్డి, సంధ్యారాణి, ఉమారెడ్డి, రాజయ్య, వనజ, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: ఎరడపల్లిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధి పనుల వద్దకు పంతుళ్లు

శంకరపట్నం, జూన్ 7: మండలంలోని ఎరడపల్లి జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ పనుల్లో భాగంగా గ్రామ శివారులోని ఓ చెరువులో సిల్ట్ తీస్తున్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని హైస్కూల్ హెచ్ఎం భూంరెడ్డి కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న, పీఎస్‌ల హెచ్ఎంలు వెంకటరాంరెడ్డి, లక్ష్మీ స్వరూప, కార్యదర్శి రవి, చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- గ్రూప్-1 నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

మాట్లాడుతున్న గ్రూప్-1 నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

కలెక్టరేట్, జూన్ 7 : ఈనెల 9న జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను ఎలాంటి పొరపాట్లకు ఆస్కారమివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని గ్రూప్-1 నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ ఆదేశించారు. ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణపై రూటు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ అధికారులకు శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శనివారం నాటికే పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అమలుచేస్తున్న నిబంధనలను పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు వివరించాలని తెలిపారు. ప్రతి కేంద్రంలో ఏర్పాటు చేయబోయే సీసీ కెమెరాల పనితీరు పరిశీలించాలని, తాగునీరు, ఇతర వసతుల కల్పనపై దృష్టిసారించాలన్నారు. సీటింగ్ ఏర్పాట్లు కూడా ఇబ్బందులేకుండా చేయాలన్నారు. నగరంలో మొత్తం 36 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 18,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. కేంద్రాల వద్ద సెంటర్ కోడ్, సెంటర్ పేరు ఏర్పడేలా పెద్ద అక్షరాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారన్నారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ తరచుగా పర్యవేక్షించాలని ఆదేశించారు. టీజీపీఎస్సీ నిబంధనలు అభ్యర్థులు, అధికారులు విధిగా పాటించాల్సిందేనని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, అడిషనల్ డీసీపీ కుమార్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మీ, కొండగట్టు జేఎన్టీయూ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీచరణ్, తదితరులు పాల్గొన్నారు.

బీమా క్లెయిమ్ అందజేత

వీరస్వామి కుటుంబానికి బీమా క్లెయిమ్ అందజేస్తున్న పాలకవర్గ సభ్యులు

శంకరపట్నం, జూన్ 7: మండలంలోని తాడికల్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర పురుషుల పొదుపు సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి బీమా క్లెయిమ్ అందజేశారు. గ్రామానికి చెందిన పురుషుల పొదుపు సంఘం సభ్యుడు వొడ్నాల వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా పొదుపు సంఘం అధ్యక్షుడు నరహరి రాజిరెడ్డి, సభ్యులతో కలిసి ఆ కుటుంబానికి బీమా క్లెయిమ్ అందజేశారు. సామూహిక బీమా క్లెయిమ్-1, 2 స్కీంల కింద రూ.60 వేలు, అభయనిధి విపత్తు సహాయం కింద రూ.10 వేల నగదును నామినీ వొడ్నాల రమాదేవికి అందజేసినట్లు తెలిపారు. ఇక్కడ సంఘం ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు ఉప్పరి సంపత్, ఆడెపు ఎల్లయ్య, చామంతుల కుమారస్వామి, పూదరి మొగిలయ్య, బొమ్మదేని చంద్రమౌళి, ఆరెపల్లి ఓదెలు, కొత్త ఆనందరెడ్డి, పాంద్రాల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు పోలు రమేశ్, ఎండీ రఫీ, గణకుడు కొరిమి సారయ్య ఉన్నారు.

విద్యుత్ అంతరాయం

సైదాపూర్, జూన్ 7 : నేడు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బొమ్మ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. సైదాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, ఆకునూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

శంకరపట్నం, జూన్ 7: సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల కారణంగా తాడికల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుందని అసిస్టెంట్ ఇంజినీర్ రావుల సంపత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తాడికల్, కేశవపట్నం, వంకాయగూడెం, కరీంపేట్, అంబాల్‌పూర్, ఇప్పలపల్లి, మక్త, చింతగుట్ట, పాపయ్యపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఇంటింటికీ మిషన్ భగీరథ నీరందించాలి

- ఎంపీడీవో సంజీవరావు

మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై శిక్షణలో ఎంపీడీవో సంజీవరావు

కరీంనగర్ రూరల్, జూన్ 7: గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించాలని ఎంపీడీవో సంజీవరావు ఆదేశించారు. శుక్రవారం మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై ఇంటి యజమానులతో సర్వే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉదయం కొత్తపల్లి మండలం, సాయంత్రం కరీంనగర్ మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, పంపు డ్రైవర్లు, అంగన్‌వాడీ, పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పంచాయతీలో మిషన్ భగీరథ యాప్‌లో ఇంటి యజమాని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. వివరాలతో పాటు, ఫొటోను జత చేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో వంద శాతం మిషన్ భగీరథ నీరందించి వారు తాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ సూర్యప్రకాశ్, ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

కోనరావుపేట, జూన్7: మర్తనపేటకు చెందిన సందీప్ (38) కరెంటు షాక్‌తో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. సందీప్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ భారం మోస్తున్నాడు. గురువారం ఆవుల షెడ్డుకు విద్యుత్ కనెక్షన్ తీగలకు సోదరుడు సాయి కుమార్‌తో కలిసి మ రమ్మతులు చేపట్టాడు. ప్రమాదశాత్తు విద్యు త్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. అతడి సోదరుడు సందీప్‌ను దవాఖానకు తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సందీప్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

కదిలిన విద్యుత్ శాఖ

నమస్తే ఎఫెక్ట్

- 'నమస్తే' కథనానికి స్పందన
- మెయింటనెన్స్‌లో భాగంగా నాలుగు రోజులుగా మరమ్మతు
- ఫసీ అహ్మద్, మానకొండూర్ ఏఈ విద్యుత్ శాఖ



రంగపేటలో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది

మానకొండూర్ రూరల్, జూన్ 7 : వానకాలం మొదట్లోనే విద్యుత్ కోతలు, ఎండుతున్న నారు మడుల తీరుపై 'సాగుకు కరెంటు కష్టాలు' అనే శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. మానకొండూర్ మండలంలోని రంగపేటలో మంగళ, బుధవారాల్లో కరెంటు సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో కొందరి రైతుల నారు మళ్లు ఎండిపోయాయి. ఈ విషయమై విద్యుత్ సిబ్బందికి పలు సార్లు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో సమస్యపై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీంతో మానకొండూర్ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది రోజంతా మరమ్మతులు చేపట్టారు. మానకొండూర్ విద్యుత్ శాఖ అధికారి ఫసీఅహ్మద్ మాట్లాడుతూ, ఇటీవల గాలి దుమారం రావడంతో తమ పరిధిలోని రంగపేట, పచ్చునూర్, మద్దికుంట, కెల్లేడు, మామిడాలపల్లి, వెల్ది, అన్నారం గ్రామాల్లో దాదాపు 70 కరెంటు పోల్స్ విరిగిపోయాయని, 25 ట్రాన్స్‌ఫార్మర్లకు ఉన్న స్తంభాలు వంగిపోయాయని, 10 ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడడంతో ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. అయినప్పటికీ గృహ అవసరాలను ఎక్కడా అంతరాయం కలగకుండా ఆల్టర్‌నేట్‌గా ఏర్పాట్లు చేసి అందించామన్నారు. మానకొండూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో నాలుగు రోజులుగా మరమ్మతు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం రంగపేటలో డ్యామేజ్ అయిన ట్రాన్స్‌ఫార్మర్‌లు, కరెంటు పోల్స్‌ను తీసివేసి, మరమ్మతు చేశారు.

శివారు కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఒకటో వార్డు కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్

మంచినీటి పంప్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

కొత్తపల్లి, జూన్ 6 : శివారు కాలనీల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఒకటో వార్డు కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం తీగలగుట్టపల్లిలోని సరస్వతీనగర్‌లో రూ.26 లక్షల వ్యయంతో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పనులు పూర్తికావడంతో కాలనీ మహిళలతో కలిసి ప్రారంభించారు. రాబోయే రోజుల్లో కాలనీలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. దీంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీ చైతన్యలో ఉచిత మెడికల్ క్యాంపు

క్యాంపునకు హాజరైన విద్యార్థులతో చైర్మన్ రమేశ్ రెడ్డి

తిమ్మాపూర్, జూన్ 7 : ఇండియన్ ఆర్మీ, అగ్నిపథ్, పారా మిలటరీదళాలకు సంబంధించి ఉద్యోగ నియామకంలో భాగంగా మండలంలోని శ్రీ చైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం మెడికల్ ఫిట్నెస్‌కు సంబంధించిన 18 రకాల మెడికల్ టెస్టులను కళాశాల చైర్మన్ ముద్రసాని రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఉచితంగా నిర్వహించారు. ఈ పరీక్షలో సుమారు 298 మంది అభ్యర్థులు హాజరై ఫిజికల్, దేహదారుఢ్య పరీక్షలు చేసుకున్నారు. పరీక్షలను శరత్ మాక్స్ వర్షన్ విజన్, కేశవ ఈఎన్టీ దవాఖానలకు సంబంధించిన డాక్టర్ల సమక్షంలో కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపల్ పల్లె శ్యాంసుందర్ రెడ్డి, పిడి లెంకల మహిపాల్ రెడ్డి, కళాశాల సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన గ్రూప్-1 పరీక్ష సామగ్రి

పరీక్ష సామగ్రిని నోడల్ అధికారి ప్రపుల్ దేశాయ్‌కి అందజేస్తున్న అధికారులు

కలెక్టరేట్/ రాంనగర్, జూన్ 7 : ఈనెల 9న జిల్లా కేంద్రంలో జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష సామగ్రి శుక్రవారం నగరానికి చేరింది. పటిష్టమైన భద్రత మధ్య వచ్చిన ఈ సామగ్రిని నగరంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గల స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఈప్రక్రియను గ్రూప్-1 పరీక్ష నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్‌తోపాటు ఆర్డీవో కే మహేశ్వర్, అడిషనల్ డీసీపీ కుమార్ పరిశీలించారు. అనంతరం ఏసీ మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇక్కడ అదనపు కలెక్టర్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మీ, కొండగట్టు జేఎన్టీయూ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కాళీచరణ్, తదితరులున్నారు.

హాస్పిటళ్లకు ఏసీలను అందించిన కలెక్టర్

కలెక్టర్‌తో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

విద్యానగర్, జూన్ 7: కరీంనగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు జనరల్ హాస్పిటల్‌కు 20 ఏసీలను శుక్రవారం కలెక్టర్ పమేలా సత్పతి కళాశాల ప్రిన్సిపాల్ శీల లక్ష్మీనారాయణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సూపరింటెండెంట్‌తోపాటు సిబ్బంది, మెడికోలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం బస్సును కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రమాద బీమా చేయించాలి

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరీంనగర్ రీజియన్ డీజీఎం, అపర్ణారెడ్డి

కరీంనగర్ రూరల్, జూన్ 7 : వ్యవసాయ పంట రుణాలు తీసుకునే సమయంలో ప్రతి రైతూ ప్రమాద బీమా చేయించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరీంనగర్ రీజియన్ డీజీఎం డీ అపర్ణారెడ్డి సూచించారు. శుక్రవారం రాజిరెడ్డి కుటుంబానికి ప్రమాద బీమా కింద మంజూరైన రూ.ఐదు లక్షల చెక్కును మేనేజర్ అపర్ణారెడ్డి బ్యాంకు మేనేజర్ దేవేందర్ రెడ్డి, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్ ఈరురాజు బ్యాంకు బ్రాంచిలో అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో 20 ఏండ్ల జైలు

కోర్టు చౌరస్తా, జూన్ 7: కుటుంబ పరిచయాన్ని అడ్డుపెట్టుకొని అభం శుభం తెలియని ఏడేళ్ల బాలికపై లైంగికదాడికి ఒడిగట్టిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. ఈ మేరకు కరీంనగర్ మొదటి అదనపు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి వెంకటేశ్ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. హుజూరాబాద్ మండలానికి చెందిన ఓ వివాహితకు భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బతుకుదెరువు కోసం భర్త, పిల్లలతో కలిసి వచ్చి హుజూరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కొన్నేళ్లకు భర్త అనారోగ్యంతో చనిపోగా ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటుంది. వీణవంక మండలం పోతిరెడ్డిపేటకు చెందిన కారుపాక రాజ్ కుమార్, సదరు వివాహిత కుటుంబం ఉంటున్న ప్రాంతంలో తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నారు. తర్వాత వారి కుటుంబంతో పరిచయం పెంచుకున్నాడు. వివాహిత కూతురు(7)కు మాయమాటలు చెప్పి 2020 ఆగస్టు 8న మధ్యాహ్నం తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. మరుసటి రెండు రోజుల కూడా అలాగే చేయడంతోపాటు ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడు. రెండు రోజుల తర్వాత బాలికకు తల్లి స్నానం చేయిస్తుండగా ఆమె పరిస్థితి చూసి ఏం జరిగిందని అరా తీసింది. దీంతో విషయం తెలుసుకున్న బాలిక తల్లి హుజూరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పటి సీఐ మాధవి రాజకుమార్‌పై కేసు నమోదు చేశారు. మరో సీఐ శ్రీనివాసరావు ఈ కేసు దర్యాప్తు జరిపారు. కేసులో సాక్షులను ప్రాసిక్యూషన్ పక్షాన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరి శ్రీరాములు విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి.. శుక్రవారం తీర్పునిచ్చారు. నిందితుడు రాజ్ కుమార్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు.

మొగ్దుంపూర్‌లో పోలీస్ చెక్‌పోస్టు ప్రారంభం

మొగ్దుంపూర్ వద్ద చెక్ పోస్ట్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ పోలీసులు

కరీంనగర్ రూరల్, జూన్ 7: కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్ వద్ద పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కరీంనగర్ రూరల్ పోలీస్ ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల తరలింపుపై నిఘా కోసం ప్రత్యేకంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్దపల్లి నుంచి కరీంనగర్‌కు వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నారు.